# ✻ కురూపి ✻

[ సాగి సత్యనారాయణరాజు ]

●

అతనంతకురూపి యీసృష్టిలో మరొకరుండరు. పొదుగుడుకళ్లు, పొడవాటికాళ్లు, పేడిమీసం, పెయ్యినాకుడు అతనికురూపాన్ని మరింత వికృతపరచాయి. అతని నల్లనిచాయకు కుక్కలు మొరుగుతాయి. అతనంటే అందరికీ పరమ అసహ్యం!

అంగసౌష్టవానికి తోడు ఆత్మబంధువులుకూడా దూరమయ్యారు. 'నా' అనే వాళ్ళొక్కరూ లేరు. ఎవరివాడో, ఎక్కడివాడో, ఎక్కడినుంచివచ్చేడో ఎవ్వరికీ తెలియదు. నాలుగైదు కుటుంబాలకుకూడా అచ్చిరాక విడిచిపెట్టిన ఆ పడిపోతున్న యింట్లో ఉన్నాడు. ఏదో అచ్చాఫీసులో పని. పదిమందిలో వున్నా అతనిబ్రతుకు బొత్తిగా ప్రవాసపుబ్రతుకు అయిపోయింది. అతన్ని అందరూ నీచంగా చూస్తారు కాని, అతనుమాత్రం నిత్యసంతోషి!

పస్తులతో వెళ్లబుచ్చేదినాలు, అధికకాలంపనీ, అధికారుల అక్రమాలు అతనికి సుపరిచితాలు. చాలీచాలని చినిగిన వస్త్రధారణ, సంస్కారమెరుగని శిరోజాలు అతని నిండు దారిద్ర్యాన్ని తెలియజేస్తూ వుంటే అతనుమాత్రం దారిద్ర్యంఅంటే యెన్నడు యెరుగని వ్యక్తిలా కనిపిస్తాడు. మరాతని మనోధైర్యం యేమిటో?

ఇవీ, అతన్నిగురించి ఆవీధివాళ్లకి తెలిసిన విషయాలు.

అందరికీ అదే ఆశ్చర్యం! అంతకురూపిని, దరిద్రుని లలిత ఎలా ప్రేమించిందీ? అని.

ప్రేమించడం, పెండ్లాడడం మానవప్రకృతికీ సహజం. కాని, యీప్రేమ, పెళ్ళి-అన్నివిధాలా-సమానులతో అయితే శోభ. నిత్యదరిద్రుని, కురూపిని, నీచుని ప్రేమించడం లలితపతనానికిగాక ఔన్నత్యానికా?

అనేకులు లలిత తండ్రీ, నారాయణరావు గారితో చెప్పారు; బ్రతిమాలారు, బెదరించారు. కాని......

ఇక లలితస్నేహితురాళ్లు ఆమెదగ్గరకు రావడం, హితబోధ, హేళనచెయ్యడం, ఎన్నోవిధాల బ్రతిమాలడం, విన్నవదనాలతో వెళ్ళిపోవడం. ఇదీ వారంరోజులయి ఎడతెరపిలేకుండా జరిగేపని.

సుందరమ్మ లలిత స్నేహితురాండ్రలో మిక్కిలి సన్నిహితమయింది. లలితకు ఆమెన్నా, సుందరమ్మకు లలితన్నా ప్రాణం.

ఇంతవరకూ పుట్టింటనున్న సుందరమ్మ వచ్చేసరికి యీవార్త అశనిపాతంలా ఆమెచెవినిపడింది. ఇది మబ్బులేని పిడుగే అని మొదట భావించి—లలితను పూర్తిగా అర్థంచేసుకొన్న సుందరమ్మ—యీ విషయంలో అంతగా విచారింప అవసరం లేదని క్రమంగా గ్రహించింది. లలిత దగ్గరకు వెళ్తే సర్వమూ తెలుస్తుందని వూరుకుంది.

ఇటువంటి సందర్భంలో సుందరమ్మ రావడం లలితకు ఒక్క సుందరమ్మ వచ్చినట్లేకాక—తన చిన్నతనంలో తన్నొంటిగాజేసి-స్వర్గస్థురాలైన తల్లీ, తనకు కర్తవ్యాన్నుపదేశించే నెచ్చెలీ, యిద్దరూ వచ్చినట్లుగా భావించింది. ఆప్యాయంగా ఎదురేగి సుందరమ్మను కౌగలించుకొని తీసికొనివచ్చింది.

కుశలప్రశ్నలైన తర్వాత సుందరమ్మ సాదరంగా లలితను చూచి అతన్ని ప్రేమించడంలోఉన్న అంతరార్థం అడిగింది.

ఇంతవరకూ అతన్ని ప్రేమించకూడదని నిర్బంధించేవారేకాని, అందర్నీ నిరాకరించి లలిత అతన్నే ఎందుకు ప్రేమించిందో ఒక్కరూ ప్రశ్నించలేదు. ఆమె చెప్పనూలేదు.

అంతకురూపిలో ఏవుత్కృష్టతా లేకపోతే విద్యావతి లలిత అతన్ని గుడ్డిగా ప్రేమిస్తుందా?

"అడిగావు గనుక చెప్తున్నాను అంది. అతనికి అచ్చాఫీసులో పని—అతిస్వల్ప వేతనం. తాను చిలగడదుంపలు, చిలుకతోటకూరతింటూ అన్నాతురులను ఆదరించడం, ఆర్తజనులకు అభిమానంతో సహాయంచేయడం యిదీ అతని నిత్యకృత్యం. ఓరోజున శరీరమంతా గజ్జిపట్టినకుక్క—రక్తం కారుతూన్న ఒడలితో, తడబడుతూ- రోడ్డువెంబడిపోతూ పాపం! కారుక్రింద పడిపోయింది. వెనక రెండుకాళ్ళూ విరిగిపోయాయి. అదిచేసే హృదయవిదారకరమైన

రోదన నసహ్యించుకొని ఓ పోలీసాయన బూటు కాలితో తన్నాడు. భగవంతుడా! దానిబాధ యింకా కళ్ళముందు కన్పిస్తూనేవుంది. నేనలా చూస్తూనే వున్నాను. సాయంత్రమారుదాటింది. అతను వచ్చాడు. తన యింటిముందరే యీ దృశ్యం! అందరివలే చూశాడు. కళ్ళవెంబడి నీళ్లు జలజలా రాలాయి. వెంటనే కాలువలోనికి దుమికి బాధ విశేషం కలుగకుండా అతిసున్నితంగా బైటికితీసి పొదివిపట్టుకొని తనయింటికి తీసుకుపోయాడు. నెల రోజులలో ఆ కుక్కను పోల్చుకోలేకపోయాను. అంతటి మార్పు! అతనిచేతిలో ఏమిమహత్యమున్నదో?

......ఆరోజే మొదలు—అతన్ని గురించి ఆలోచించడానికి, అతన్నిచూచి జాలిపడడానికి, అతన్ని మనస్సులో అభినందించడానికి. అతని ప్రతి స్వల్ప కార్యాన్ని అతిశ్రద్ధతో గమనించడానికి, అతన్ని ఆదర్శపురుషునిగా భావించడానికి, అతడెందరెందరికో, ఎన్నిప్రాణులకో, ఎన్నోవిధాల సహాయం చేశాడు. పరోపకారంకొరకెన్నో దినము లేకాదశీ పాలనంచేశాడు. అన్నీ ఆపరమేశ్వరునికే తెలియాలి. దీనితో నా హృదయం కదిలిపోయింది. అతనిలోని యేదో మహత్తరశక్తి నన్నాకర్షించింది. ఆపుణ్యమూర్తికి నాహృదయం చోటిచ్చింది.

అతన్ని కురూపిఅంటారు; దరిద్రుడంటారు... భూతదయ తెలియని హృదయాలతో, తమలోని కురూపాన్ని గుర్తించలేని ఈ నికృష్టజీవులకన్నా అతను కురూపా? తాహుకలిగే తమతోడిసోదరుల దీనావస్థకళ్ళారాచూస్తూసహాయంచేయని ఈ నికృష్ట దరిద్రులకంటే దరిద్రుడా అతను? బాహ్యసౌందర్యం బాహ్యాడంబరం యివి మేడిపండు ప్రతిచ్ఛాయలు, మేకవన్నె పులులు; గోముఖవ్యాఘ్రాలు; కమ్మని సువాసనల నలుగడలకు వ్యాపింపజేసే కస్తూరి చూడ్డానికెలావుంటుంది? అంతమాత్రంచేత వాటి ఉత్కృష్టతకు, ఆకర్షణకు, ఆధిక్యతకు, యేమేనా కూన్యత కలిగిందా? అర్థంలేని రూపతృష్ణ- ఋజువర్తనానికి, ఆదర్శజీవనానికీ అనర్థంకలుగజేస్తుంది. అదృష్టంవల్ల కృతార్థురాలనయాను అతని సాహచర్యాన. నా పరమావధి. అతనిలోని దైవత్వమే నాకు జ్ఞానదీపిక, అతను యెవరికంటికి యెలా కనిపిస్తేనేం? నాకు ప్రభువు......"




# రతిరత్న మాత్రలు

దంపతులు సంయోగంవల్ల పొందే ఆనందం లోకంలో యింక దేనివల్లా రాదు. తృప్తిగా అటువంటి ఆనందాన్ని పొందేవారు దేవత్వాన్ని అనుభవించినవారౌతారు. మీరు సదా యౌవ్వనులై తనివితీర దాంపత్యసుఖ మనుభవించాలంటే మీ జీవితంలో ఒకప్పుడు రతిరత్న మాత్రలు వాడాలి. దీనిగుణం శాశ్వతం. ఇది గుండెకు గాని, ఆరోగ్యానికి గాని చెడుపుచేయదు. దీని సేవనవల్ల ఆశా, ఆనందమూ, ఏమీలేక జీవించే కళేబరాలలాంటి జీవితాల్ని కూడ సరిచేసి అద్వితీయమైన ఆనందమనుభవింపచేసింది. ఉత్సాహమూ, బలమూ పోయి దేనికీ పనికిరాని నిర్జీవమైన నిరాశాపరులకు కూడ అద్భుతశక్తి కలిగించి కలలో మాత్రంతోపోయే కుక్కనష్టాన్ని పోగొట్టి ముసలివారికి కూడ యౌవ్వనమొసగే సాటిలేని ధాతుపుష్టి మందని ప్రశంసలు పొందింది. కనుక మీరు ఎంతబలహీనులైనాసరే భోజనానంతరం ఒక మాత్ర తీసుకుంటే గంటలో నరములకు శక్తి కలిగిస్తుంది.

10 రోజులకు రు. 2-8-0; 20 రోజులకు రు. 4-8-0

40 రోజులకు రు. 8-0-0 (వి. పి. చార్జి 0-12-0)

అంగదౌర్బల్యములున్నవారికి "రతిరత్న తైలం" పైపూతకు. చిన్నసీసా రు. 2-0-0; పెద్దది రు. 3-8-0.

**మెడికల్ హాడక్ట్స్**

79, వరదాముత్తియప్పన్ వీధి, మద్రాసు